సాక్షి చిత్తూరు
శనివారం । 22 । జూన్ । 2024



ఆటోను ఢీకొన్న వోల్వో బస్సు

ఆటోను వెనుక నుంచి వోల్వో బస్సు ఢీకొన్న సంఘటనలో మామిడికాయలు కోసే కూలీలు గాయపడ్డారు. - 8లో



ఎంపీపీ ఎల్లప్ప హఠాన్మరణం

నదుం ఎంపీపీ ఎల్లప్ప హఠాన్మరణం చెందారు. ఆయనకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. - 8లో



గరుత్మంతునిపై గోవిందుడు

అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. - 8లో

మనుషులా... తోడేళ్లా?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ కార్యకర్తలు కొందరు పగతో రగిలిపోతున్నారు. మనిషి జన్మనెత్తి క్రూరజంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. నిద్దురలేస్తే నెత్తురు కళ్లజూడడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడుతున్నారు. వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వేటకొడవళ్లు, మారణాయుధాలతో రావణకాష్టం సృష్టిస్తున్నారు. ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిని చితకబాదుతున్నారు. వీరి ఆగడాలకు కళ్లెం వేయాల్సిన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసులు సైతం చూసీచూడనట్టు వదిలేయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది.



గంగనపల్లెలోని వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడి ఇంటి వద్ద వేట కత్తులతో ప్రత్యర్థులు

విస్తరిస్తున్న విషసంస్కృతి

- ఎన్నికల తర్వాత గొడవలు.. దాడులు ఎప్పుడూ లేదు
- చిత్తూరులో చాపకిందనీరులా పాకుతున్న గూండాగిరి
- శాంతిభద్రతల రక్షణలో పోలీసుల వైఫల్యం
- కేసులతో యువత భవితకు దెబ్బ
- నేతలు కల్పించుకుంటేనే శాంతియుత వాతావరణం



టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన చుడా మాజీ చైర్మన్ కారు

చిత్తూరు అర్బన్: చిత్తూరు రాయలసీమలో ఉన్నా, ఫ్యాక్షన్ గొడవలు, పగ, ప్రతీకార దాడులకు దూరంగా ఉంటుంది. విద్యావంతులు ఎక్కువగా ఉన్న చిత్తూరులో వీలైనంత వరకు గొడవల జోలికి ఎవ్వరూ వెళ్లరు. కానీ ఎప్పుడూలేని విధంగా ఈసారి సార్వత్రిక ఎన్నిక ఫలితాలొచ్చినప్పటి నుంచి చిత్తూరులో గొడవలు పెరిగిపోయాయి. 'నువ్వు ఎన్నికల్లో ఆ పార్టీ నేత కోసం పనిచేసి, మమ్మల్ని కవ్వించావు. అందుకే ఈ దాడులు' అన్నట్లు గెలిచిన నేతకు చెందిన అనుచరులు గొడవలు చేస్తున్నారు. దీనివల్ల తాత్కాలిక ఆనందం పొందినప్పటికీ.. ఊరిని అభివృద్ధి చేయడంపై దృష్టి పెడదామనుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు కచ్చితంగా చెడ్డ పేరు తెస్తుంది. పైగా భవిష్యత్తులో మరో పార్టీ నాయకుడు గెలిస్తే ప్రతీకార దాడులకు దారితీసే విష సంస్కృతికి దారి చూపినట్లు అవుతుంది.

ఇది తప్పేకదా!

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడ్డాయి. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, చిత్తూరులో ఆ పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందిన విషయం తెలిసిందే. ఫలితాలొచ్చిన రోజే చిత్తూరులో విధ్వంస ఘటనలు మొదలయ్యాయి. ఆఫీసర్స్ లేన్ వీధిలో ఉన్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భవనంపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. తాళాలు వేసిన భవనంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. చివర్లో భవనంలోకి పెట్రోలుపోసి నిప్పంటించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో జరిగిన ఈ ఘటనతో భవనం రెండో అంతస్తులో అద్దెకుంటున్న కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు పెట్టాయి. జరగరానిది ఏదైనా జరిగి ఉంటే బాధ్యత ఎవరు వహించి ఉంటారు..?. ఇక దాని తరువాత రెండు చికెన్ సెంటర్లు, ఓ హోటల్‌పై దాడి చేశారు. మరో బేకరీని నేలమట్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడి వద్ద పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌ను ఫోన్‌లో అంతు చూస్తామని బెదిరించారు. ఓ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ఇంటి వద్దకు వెళ్లి వేట కత్తులు చూపిస్తూ రోడ్డుపై వెళుతున్న వాళ్లను భయభ్రాంతులకు గురిచేశారు. తాజాగా గంగనపల్లెలో ఓ ఇంటిపై రాళ్లదాడికి దిగారు. చుడా మాజీ చైర్మన్ కారును ధ్వంసం చేశారు. ఎస్ఆర్.పురానికి చెందిన ఓ యువకుడ్ని కిడ్నాప్‌చేసి గొడ్డును బాదినట్టు బాదారు.

ఖాకీలపై అపవాదు

రెండు ఘటనలు మినహా.. మిగిలిన వాటిల్లో పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఇదేమిటంటే ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని చెబుతున్నారు. ఫిర్యాదు రాలేదని సమాజంలో హత్యలు, గొడవలు, విధ్వంసాలు చేయడం సరైన చర్యలేనా..? అనేది పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. అసలు గొడవలు జరిగే అవకాశం ఉందని ముందుగా గ్రహించడానికి పనిచేసే నిఘా సంస్థల్లోని పోలీసులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారనే అపవాదు మిగిలిపోయింది. రెండు, మూడు ఘటనల్లో నిందితులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి నేర చరిత్ర లేని యువకులు ఈ ఘటనలతో పోలీసుల రికార్డుల్లోకి ఎక్కినట్లయ్యింది.



చిత్తూరులో అగ్నికి ఆహుతి అవుతున్న గ్రానైట్ ప్రైవేట్ ఆఫీసు (ఫైల్)

పరిష్కారం ఏమిటి?

దాడుల సంస్కృతి ఇలాగే కొనసాగితే ముున్ముందు చిత్తూరులో భయానక పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదు. గెలిచిన నాయకులు తమకు ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేద్దామని ఆలోచన చేస్తున్న సమయంలో.. జరుగుతున్న హింసాత్మక ఘటనలు పార్టీలతో పాటు నాయకులకు చెడ్డ పేరు తెచ్చి పెడుతుందని గ్రహించలేకపోతున్నారు. గొడవలు చేస్తున్న వ్యక్తులు వాళ్ల నాయకుడి ప్రమేయం లేకుండానే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నట్లు కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. తీరా గొడవలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతూ అప్పటికే జరగాల్సిన నష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అధికారం చేతుల్లో ఉంటే ఊరిని అభివృద్ధి వైపు కాకుండా.. రౌడీయిజం చేస్తూ పెత్తనం చెలాయించొచ్చనే చెడు భావన యువతను పెడదారివైపు నడిపించే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎన్నుకున్న నాయకులు వాళ్ల కార్యకర్తలు, అనుచరులతో సమావేశం నిర్వహించి హింసాత్మక ఘటనలకు పాల్పడొద్దని హెచ్చరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా అలాంటివి చేస్తే పోలీసులు తీసుకునే చర్యలకు తాము అడ్డుపడమని కచ్చితంగా చెప్పాలి. వీలైతే తనకోసం పనిచేసే కార్యకర్తకు ఆర్థికంగా నిలదొక్కుకునే దారులు చూపిస్తే.. సమాజం కూడా హర్షిస్తుందనే విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆసనం.. ఆరోగ్య సోపానం

- ఘనంగా జిల్లా స్థాయిలో యోగా డే
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ, ఇతర అధికారులు



ఆసనాలు వేస్తున్న పోలీసు సిబ్బంది, యోగా చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ కళాశాల మైదానంలో యోగా దినోత్సవం నిర్వహించారు. నిరంతరం పని ఒత్తిడిలో ఉండే జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలకు యోగా శాస్త్రం అందించిన ఘనత మన భారతదేశందేనని చెప్పారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి యోగా చక్కటి పరిష్కారం అన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయడం ఒక్కటే అత్యుత్తమ మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను తప్పనిసరి చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, ప్రజలు, యువత సామూహిక యోగా చేశారు. యోగా గురువులకు దుశ్శాలువతో సన్మానం చేసి బహుమతులు అందజేశారు. జిల్లా అధికారులతోపాటు యోగా గురువులు బాబు, అను తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు యోగా నేర్చుకోవాలి

చిత్తూరు అర్బన్: నిత్యం ఉద్యోగ ఒత్తిడిలో ఉండే పోలీసులు, మానసిక ప్రశాంతత కోసం తప్పనిసరిగా యోగా నేర్చుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ సూచించారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో పోలీసులతో కలిసి యోగా ఆసనాలు వేశారు. ఎస్పీ మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

అమరావతిలో పైరవీల జోరు

- టీటీడీ చైర్మన్, బోర్డు మెంబర్ల కోసం పోటాపోటీ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రేసులో పలువురు నేతలు
- శ్రీకాళహస్తి, కాణిపాకం ట్రస్ట్‌బోర్డు కోసం స్థానికుల పట్టు
- తిరుపతి తుడా కోసం ప్రయత్నాలు ముమ్మరం
- ఆ రెండు ఎమ్మెల్సీల కోసం తిరుపతి, శ్రీకాళహస్తి నేతల పోటీ

సాక్షి, తిరుపతి: అమరావతి కేంద్రంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీటీడీ, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయ పాలకమండలి, తిరుపతి తుడా అధ్యక్ష పదవులతో పాటు ఎమ్మెల్సీ కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు జోరుగా పైరవీలు నెరుపుతున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో అతిముఖ్యమైన తిరుపతి తుడా చైర్మన్ పదవి కోసం ఆ మూడు పార్టీల నేతలు ఎవరికి వారు ఢిల్లీ నుంచి తెలంగాణ, ఏపీలోని ముఖ్యనేతలను కలిసి తనకు ఇప్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ పదవులపై అమరావతిలో పెద్ద చర్చే నడుస్తోంది. టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యుల కోసం ఉమ్మడి జిల్లాతో పాటు స్థానికేతరులు అనేక మంది పోటీపడుతున్నారు. ప్రధాని నుంచి కేంద్ర మంత్రులు, ఏపీ, తెలంగాణలోని మంత్రుల నుంచి ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ల జాబితాలో ఆయనకు మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చంద్రబాబు మొండిచేయి చూపించారు. ఈ పరిస్థితుల్లో టీటీడీ చైర్మన్, బోర్డు మెంబర్ల విషయంలో జిల్లా వాసులకు ప్రాధాన్యత కల్పిస్తారనే జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ ప్రచారంలో అమరనాథ్‌రెడ్డి పేరు ముందు వరుసలో ఉంది. ఇంకా తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ పేరు కూడా తెరపైకి వస్తోంది. అదేవిధంగా బీజేపీ కోటాలో ఈ సారి టీటీడీ చైర్మన్ పదవి తమవారికే ఇప్పించుకునేందుకు ముఖ్యనేతలు పట్టుబడుతున్నారు. కమలనాథుల జాబితాలో శ్రీకాళహస్తి మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోలా ఆనంద్, తిరుపతి నుంచి భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు. వీరిద్దరిలో కోలా ఆనంద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతనికి ఢిల్లీ, తెలంగాణ, ఏపీకి చెందిన బీజేపీ అగ్రనేతల ఆశీర్వాదం మెండుగా ఉంది. బోర్డు మెంబర్ల విషయానికి వస్తే టీడీపీకి, ముఖ్యంగా చంద్రబాబు, నందమూరి కుటుంబానికి నమ్మకస్తుడిగా ముద్రపడిన ఎన్టీఆర్ రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ ముందు వరుసలో ఉన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ రాజు 1984 నుంచి 1988 వరకు బోర్డు మెంబర్‌గా ఉన్నారు. 1983లో తిరుపతి ఎమ్మెల్యేగా నామినేషన్ వేసి, ఎన్టీఆర్ కోసం రాజు పోటీ నుంచి తప్పుకున్నారు. దాంతో టీటీడీ పాలకమండలిలో నాటి సీఎం ఎన్టీఆర్ రాజుకి స్థానం కల్పించారు. 2014–19 టీడీపీ హయాంలో టీడీపీ బోర్డు మెంబర్‌గా శ్రీధర్‌వర్మ పేరు దాదాపు ఖరారు అయ్యింది. అయితే సమీకరణలో భాగంగా వేరొకరికి ఇవ్వాల్సి వచ్చింది. ఆ సమయంలో చంద్రబాబు ఎన్టీఆర్ రాజుకు మాట ఇచ్చారని తెలిసింది. అందులో భాగంగా బోర్డు మెంబర్ల జాబితాలో శ్రీధర్‌వర్మ పేరు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీకాళహస్తి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి కోసం అనేక మంది స్థానిక టీడీపీ నాయకులు, మరో వైపు బీజేపీ నాయకులు, జనసేన శ్రేణులు పట్టుబడుతున్నారు. ఆ జాబితాలో ఎస్సీవీ దిలీప్, చంచయ్యనాయుడు, రేణిగుంట టీడీపీ మండల అధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, కోట వినూత పేర్లు వినిపిస్తున్నాయి. అదే విధంగా కాణిపాకం ఆలయ పాలకమండలి అధ్యక్ష పదవి కోసం పలువురు స్థానికులు పోటీపడుతుండడం గమనార్హం.



ఎమ్మెల్సీ, తుడా కోసం పోటాపోటీ

తిరుపతి తుడా చైర్మన్ కోసం అనేక మంది పోటీలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సుగుణమ్మ, భానుప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పోటీపడుతున్నారు. తిరుపతి నాయకులే కాకుండా.. తుడా పరిధిలో ఉన్న వారు సైతం ఈ సారి చైర్మన్ పదవి తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్నట్లు తెలిసింది. తుడా చైర్మన్ కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. తుడా చైర్మన్ పదవి వస్తే, అదనంగా టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో మెంబర్ అవ్వొచ్చనే ఆలోచనతో ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇకపోతే రాష్ట్రంలో ఉన్న రెండు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ పదవి కోసం మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సుగుణమ్మతోపాటు కోలా ఆనంద్ పేరు కూడా వినిపిస్తోంది. ఎస్సీవీ నాయుడు టీడీపీ నుంచి పోటీపడుతుంటే.. సుగుణమ్మ జనసేన, కోలా ఆనంద్ బీజేపీ కోటాలో ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరి ముగ్గురూ ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడ్డారు. వీరి త్యాగాన్ని గుర్తించి ఎమ్మెల్సీ లేదా టీటీడీ, తుడాలో ఏదో ఒకటి ఇవ్వకపోతారా? అని వారి వర్గీయులు ధీమాగా ఉన్నారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పదవుల కోసం జిల్లాకు చెందిన నాయకులు ఎవరికి వారు పైరవీలు ప్రారంభించారు.

న్యూస్‌రీల్

ఫ్యాక్టరీలకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలంలోని పలు ఫ్యాక్టరీలకు కలెక్టర్ సగిలి షణ్మోహన్ నోటీసులు జారీ చేశారు. 'పల్లెలపై కాలుష్య పడగ' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాక్టరీలను నడిపిస్తున్న ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారు. అందులో పరిశ్రమల వార్షిక సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు 2021-22, 2022-23కు సంబంధించిన బ్యాలెన్స్ షీట్‌లు, గతేడాది లాభ నష్టాల ఖాతా వివరాలు, తరుగుదల ప్రకటన కార్మికుల జీతభత్యాల వివరాలు, మెటీరియల్స్ స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉందని పేర్కొంది. దీనిపై ఫ్యాక్టరీ యజమాన్యం స్పందించడం లేదని తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కలెక్టర్ ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

బీసీజీ వ్యాక్సినేషన్‌లో జిల్లాకు మూడో స్థానం

చిత్తూరు రూరల్(కాణిపాకం): బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో జిల్లా మూడవ స్థానంలో ఉందని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్‌కు 2,84,536 మందిని గుర్తించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గురువారం టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లక్ష మందికిపైగా టీకా వేసుకున్నారని చెప్పారు. ఈ ఫలితంగా జిల్లా మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. టీకా కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. ప్రజలు టీకాపై అపోహలు వీడాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



బోయకొండలో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేశారు. మామిడి, వేపాకు తోరణాలతో ముస్తాబు చేశారు. రాహుకాలంలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యాప్రమాణాలు పెంచుతాం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తొలి నుంచే అన్ని రకాల విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలని డీఈఓ దేవరాజు సూచించారు. ఆయన శుక్రవారం హెచ్‌ఎంలతో మాట్లాడుతూ డ్రాపౌట్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. యూడైస్ ప్లస్ అప్‌లోడ్ చేయడం, నేను బడికి పోతా ప్రచార కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల కిట్ల పంపిణీ, ఈ హాజరు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పాఠశాల అకడమిక్ క్యాలెండర్ త్వరలో విడుదలవుతుందని చెప్పారు. అకడమిక్ క్యాలెండర్ రాగానే హెచ్‌ఎంలు తమ తమ పాఠశాలల్లో టైమ్ టేబుల్ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్నభోజనం రుచిగా నాణ్యతగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.


అతిసారంపై అప్రమత్తత అవసరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కలుషిత నీరు, ఆహారం కారణంగా అతిసారం వ్యాపిస్తుందని, ప్రజలు తాగునీటితోపాటు ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ వెంకట ప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. అతిసారం వ్యాపిస్తే వెంటనే స్పందించాలన్నారు. అందుకు గల కారణాలను ఆరా తీసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని తాగునీటి సమస్యలతోపాటు పారిశుధ్య సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. బాధిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం ఈఈ, డీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉండే వ్యవసాయ సర్వీసులను సీనియారిటీ ప్రకారం విడుదల చేయాలని ఆదేశించారు. పరిశ్రమల సర్వీసులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు పడుతున్న సమయం కాబట్టి క్షేత్రస్థాయి లైన్ల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షం లేని సమయంలో నిర్వహణ నిమిత్తం లైన్ల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా డివిజన్ల వారీగా వస్తున్న కరెంటు బిల్లుల డిమాండ్ తెలుసుకున్నారు. ఇక మీదట వందశాతం వసూళ్లు రావాలని తెలిపారు. వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఈల దగ్గర వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయించే పని డీఈ, ఈఈలదేనని చెప్పారు. సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకం ఖచ్చితంగా పెట్టాలన్నారు. సబ్‌స్టేషన్ నిర్వహణ సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈలు హరి, మునిచంద్ర, డీఈఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం!



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దోమలను కట్టడి చేయగలిగితే మలేరియాను నిర్మూలించగలమని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట గ్రామంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. మలేరియా వ్యాప్తిపై అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. ఇంటి, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొలుత పీహెచ్‌సీలోని ల్యాబ్ రిజిస్టర్లను పరిశీలించారు.

క్లుప్తంగా

ఉపాధి వేగవంతం



కొత్త పని ప్రారంభిస్తున్న పీడీ రాజశేఖర్

యాదమరి(పూతలపట్టు): ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని బుడితిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోనున్న అమృత సరోవర్ కుంట వద్ద ఉపాధి హామీ కూలీలు, సిబ్బందితో శుక్రవారం యోగా డే నిర్వహించారు. అనంతరం రైతు ఆనంద్ పొలంలో నూతన ఫారం పాండ్ పనిని ప్రారంభించారు. ఫారం పాండ్ వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ వేతనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని, కూలీల చేత అడిగి తెలుసుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం 6 గంటలకే ఉపాధి పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ బాలా, ఈఏ రమ్య, మధు, శ్రీనివాసులరెడ్డి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గురువారం మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో యూజీ (శాస్త్ర), పీజీ(ఆచార్య) కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వరకు గడువు ప్రకటించినా, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈనెలాఖరు వరకు పొడిగించామన్నారు. 21 విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులతో పాటు టెంపుల్ మేనేజ్‌మెంట్, జోతిష్యం, వాస్తు, మ్యాన్‌స్క్రిప్ట్ సబ్జెక్టుల్లో డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

గరుత్మంతునిపై గోవిందుడు



గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిస్తున్న గోవిందుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు శుక్రవారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై విహరించారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో గోవిందుడు గరుడ వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. ఉదయం 3.30 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. 7.30 గంటలకు శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. 8 నుంచి 9 గంటల వరకు పల్లకిలో మోహినీ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. 10 నుంచి 11–30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. తదుపరి శుద్ధి, రెండవ గంట కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారు ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. 5.30 నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలాపనతో కనువిందుగా ఊంజల్ సేవ సాగింది. తదుపరి శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు వసంతోత్సవం. రాత్రి 7 గంటల నుంచి 8 వరకు గజ వాహనంపై స్వామి వారు విహరిస్తారు.



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



మోహినీ అవతారంలో వేంకటేశ్వర స్వామి



చూడ ముచ్చటైన కోలాటం

గరుడ సేవలో తరించిన అశేష భక్తజనం

బ్రహ్మోత్సవాల్లో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే గరుడ సేవలో పాల్గొన్న అశేష భక్తజనం స్వామిని కనులారా దర్శించి తరించారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరితుడై గరుత్మంతుడిపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాలబాలికల కోలాటాల నడుమ శ్రీవారు భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారికి నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎల్లప్ప హఠాన్మరణం



సదుం: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- నివాళులర్పించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప



ఎల్లప్ప (ఫైల్)

సదుం: ఎంపీపీ ఎల్లప్ప (74) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. నడిగడ్డ పంచాయతీ చిచ్చిలివారిపల్లెలోని ఆయన స్వగృహంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స ప్రారంభిస్తుండగానే ఆయన మృతి చెందారు. ఎల్లప్ప మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సహచర విద్యార్థి. తపాలాశాఖ అధికారిగా, యూనియన్ నాయకునిగా గతంలో సేవలు అందించారు. ఎంపీపీ మృతదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి నివాళులు అర్పించారు. ఎంపీ మిథున్ రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, దళిత సంఘాల నాయకులు సందర్శించి అంజలి ఘటించారు. ఆయన మృతదేహానికి శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

25న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 25న సంకటహర గణపతి వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 6 గంటల వరకు ఈ వ్రతం ఉంటుందని చెప్పారు. ఈ వ్రతంలో పాల్గొనేందుకు భక్తులు నేరుగా కానీ, లేదా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందవచ్చన్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదంలో 8 మందికి గాయాలు

సదుం: రోడ్డు ప్రమాదంలో 8 మంది గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. రంగనాథమిట్ట సమీపంలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు ఆటోలో మండల కేంద్రానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బూరగమంద క్రాస్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో 8 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



బోయకొండలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఉత్సవమూర్తి ఎదుట ఉభయదారులచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీహోమ పూజలకు వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

ఆటోను వెనుక నుంచి ఢీకొన్న వోల్వో బస్సు



ప్రమాదంలో గాయపడ్డ కూలీలు

గంగవరం: మామిడి కాయలు కోసే కూలీలు పని ముగించుకుని ఆటోలో తమ గ్రామానికి వెళుతుండగా వెనుక నుంచి వోల్వో బస్సు ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన పలమనేరుకు సమీపంలోని నాగమంగళం వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు బైరెడ్డిపల్లె మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన కూలీలు కొంతమంది గంగవరం మండలం కీలపట్ల వద్ద మామిడికాయలు కోసే పనికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని అందురూ ఒకే ఆటోలో తమ గ్రామానికి బయలుదేరారు. నాగమంగళం వద్ద వెళ్తుండగా బెంగుళూరు వైపు వెళ్తున్న వోల్వో బస్సు ఈ ఆటోని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు కూలీలు గాయపడ్డారు. ఆటో ముందు భాగం ధ్వంసమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు



అర్ధగిరి క్షేత్రంలో భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయ శుద్ధి చేయించి మూలవిరాట్ శ్రీ వీరాంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. స్వామికి ధూపదీపనైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించున్నారు. భక్తులకు ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

ఆలయంలోని మండపంలో భక్తి ప్రపత్తులతో సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన, ఆరాధన చేయించారు. తర్వాత వేదమంత్రాలు పఠనం చేస్తూ హోమం నిర్వహించారు. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావుతో పాటు ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

ఆలయంలో ఆలయ ఈఓ హనుమంతు రావు పర్యవేక్షణలో అర్చకులు ప్రాకారోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. సుగంధపరిమళ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో వీరాంజనేయస్వామి కొలువుదీరి ఆలయం, పుష్కరిణి చుట్టూ ప్రాకారం చేసి భక్తులకు కటాక్షించారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణలోని కళావేదికలో భక్తుల కాలక్షేపం కోసం హరి కథలు, భజనలు, కోలాటాలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధగిరి క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని ఎగువ మత్యంలో అభయ ఆంజనేయస్వామికి, సరకల్లు చిల్లారపల్లెలో వరగిరి ఆంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రాకారోత్సవంలో అర్చకులు, భక్తులు

సకల వసతులకు శ్రీకారం!

- కాణిపాకంలో వినాయక వసతి భవన అభివృద్ధి
- రూ.13కోట్లతో అదనపు వసతి భవన నిర్మాణం
- బ్రహ్మోత్సవాలకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు



బ్లాక్-1లో అదనపు గదుల నిర్మాణం



బ్లాక్-2లో పై అంతస్తులో గదుల నిర్మాణం

కాణిపాకం: కాణిపాకంలో సకల వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. వరసిద్ధుని సేవలో తరించే భక్తులకు సకల సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నారు. సామాన్యుల నుంచి వీఐపీ భక్తులు ఇక్కడే బస చేసి దర్శించుకునేలా భవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. వంద గదులున్న భవనాన్ని మరో 104 గదులకు పెంచారు. రూ.13కోట్లతో అదనపు వసతి భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు పూర్తిచేస్తున్నారు.

గతంలో ఇలా....

కాణిపాకంలో భక్తులకు సౌకర్యార్థంగా 12ఏళ్ల కిత్రం వసతి భవనాన్ని నిర్మించారు. భక్తులకు 100 గదులతో వసతిని కల్పిస్తూ వచ్చారు. రెండు బ్లాక్‌ల్లోని గదుల్లో సూట్ రూమ్‌లు 15, ఏసీ 40, నాన్ ఏసీ 43, సాధారణ గదులు 2 ఉన్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా వసతి భవనం సరిపోవడం లేదు. దీంతో భక్తులు సదన్‌కు క్యూకడుతున్నారు. ప్రస్తుతం 30వేల మందికి పైగా భక్తులు వరసిద్ధుని దర్శనానికి వచ్చి వెళుతున్నారు. ఇందులో స్థానికులతో పాటు అధికంగా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారు. వీరిలో చాలా మంది స్వామి దర్శనం చేసుకుని వెళ్లిపోతున్నారు. కొంత మంది స్థానికంగా ఉన్న వసతి గదుల్లో విశ్రాంతి తీసుకుంటూ స్వామి దర్శనం కోసం వేచి చూస్తుంటారు. ఈ తరుణంలో కాణిపాకంలో ఉండే దేవస్థాన వసతి భవనంతో పాటు ప్రైవేటు వసతి గదులు ఖాళీలు ఉండడం లేదు. దీంతో గదుల సంఖ్యను పెంచాలని ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు తీర్మానించారు. అయితే 100 గదుల్లో కొళాయిలు, మంచాలు, పైపులైన్లు, కిటికీలు, డోర్‌లు, ఫ్యాన్లు, లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. పైకప్పుల్లో చెమ్మ సమస్య పుట్టుకొచ్చింది. ప్రతి గదిలోనూ, రెండు మరుగుదొడ్డి ఉండడం వల్లే ఈ సమస్యకు కారణమని అధికారులు గుర్తించారు. దీంతో భక్తులు గదుల్లో ఇబ్బందిపడుతున్నారు. వసతి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసేవారు. దీనిపై అధికారులు స్పందించారు. రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా 2021లో రూ.25 లక్షలతో వీటిని మరమ్మతు చేయించారు.

నూతనంగా రెండు అంతస్తులు

ప్రస్తుతం ఉన్న రెండు బ్లాక్‌ల వినాయక సదన్‌పై మరో రెండు అంతస్తుల్లో అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకు గాను 2021లో అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.13 కోట్లతో 104 గదులు నిర్మిస్తున్నారు. 88 గదులు, 14 సూట్‌లను అధునాతన వసతులతో కడుతున్నారు. ఇప్పటి వరకు రూ.10 కోట్లతో పనులు చేపట్టారు. మరో రూ.3కోట్ల మేర మాత్రమే నిర్మాణ పనులు మిగిలి ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం నడుస్తున్న వసతి భవనంలో ఉన్న తప్పిదాలను గుర్తించి, నూతనంగా నిర్మిస్తున్న గదుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. లీకేజీ సమస్యలకు తావులేకుండా చూస్తున్నారు. నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫ్లోరింగ్, డోర్ ఫిటింగ్, ఎలక్ట్రికల్ వర్కులు మాత్రమే ఉన్నాయని అంటున్నారు. మరో రెండు కోట్లతో మంచాలు, టేబుళ్లు, ఇతరత్రా సౌకర్యాలకు వ్యయం కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. బ్రహ్మోత్సవాల కల్లా ఈ పనులను పూర్తి చేసి భక్తులకు వసతి కల్పించాలని అధికారులు పూనుకున్నారు.

భక్తులకు మెరుగైన వసతి కల్పించడమే



భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం భాగ్యం కల్పించడంతో పాటు వారి వసతికి ఢోకా చూడలేకుండా చూడాలనే ప్రయత్నం చేస్తున్నాం. ఇది కూడా అభివృద్ధిలో భాగమే. కొన్ని సందర్భాల్లో వసతులు గదులు లేక భక్తులు అల్లాడిపోతున్నారు. బ్రహ్మోత్సవ సమయంలో డిమాండ్ అధికంగా ఉంది. ఉన్న గదులు సరిపోవడం లేదు. తీర్మానం ప్రకారమే ఈ వసతి భవన అదనపు గదుల నిర్మాణానికి పూనుకున్నాం. శరవేగంగా పనులు పూర్తి కావస్తున్నాయి. రానున్న బ్రహ్మోత్సవానికి గదుల నిర్మాణ పనులను పూర్తి చేసి భక్తులకు బసకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

-వెంకటేశు, ఈవో, కాణిపాకం